# అభివృద్ధిని చూసి ఓటెయ్యండి

- కాంగ్రెస్, బీజేపీ నేతల మాటలు నమ్మకండి
- సంక్షేమానికి మారుపేరు సీఎం కేసీఆర్ పాలన
- ప్రజల ఆశీర్వాదంతో మరోసారి గెలుస్తా
- సీఎం కేసీఆర్ దీవెనలతో మళ్లీ ఘన విజయం సాధిస్తా
- బీఆర్ఎస్ పాలకుర్తి నియోజకవర్గ అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- పాలకుర్తిలో నామినేషన్ దాఖలు


పాలకుర్తిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

దేవరుప్పుల/పాలకుర్తి రూరల్, నవంబర్ 6 : సీఎం కేసీఆర్ ఆశీస్సులు, ప్రజల సహకారంతో పాలకుర్తి నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరిగాయని, ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని బీఆర్ఎస్ పాలకుర్తి నియోజకవర్గ అభ్యర్థి, రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. కాంగ్రెస్, బీజేపీ నేతల మాయమాటలు నమ్మొద్దని, తన హయాంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి ప్రజలు ఘన విజయం చేకూర్చాలని కోరారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎర్రబెల్లి దయాకర్‌రావు సోమవారం స్థానిక రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయంలో ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. అనంతరం బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను, పార్టీ మ్యానిఫెస్టోను అమలు చేశానని పేర్కొన్నారు. తాను నియోజకవర్గంలో అడుగుపెట్టిన నాడు అన్ని మండలాల్లో కరువు తాండవించేదని, సాగు, తాగునీటి సమస్య తీవ్రంగా ఉండేదన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపేవారన్నారు. వ్యవసాయం లేక రైతులు వలస వెళ్లడంతో ఇళ్లకు తాళాలు కనిపించేవన్నారు. పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో సీఎం కేసీఆర్ పెద్ద ఎత్తున సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టడడంతోపాటు 'మిషన్‌కాకతీయ'లో చెరువులను పునరుద్ధరించడంతో జలకళ సంతరించుకుని బీడు భూములు సస్యశ్యామలమయ్యాయని ఎర్రబెల్లి తెలిపారు. 'మిషన్ భగీరథ'తో ప్రజలందరికీ స్వచ్ఛమైన తాగునీరు అందుతున్నదన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రైతులకు రూ.లక్ష చొప్పున పంట రుణాలు మాఫీ చేశామన్నారు. రూ.22 వేల కోట్లు రుణం ఉండగా, ఇప్పటి వరకు రూ.19 వేల కోట్లు బ్యాంకుల్లో జమ చేశామని, మిగిలిన నిధులు త్వరలోనే జమ చేస్తామన్నారు.

## పాలకుర్తి ప్రజల రుణం తీర్చుకోలేనిది..

తనను పాలకుర్తి నియోజకవర్గ ప్రజలు మూడు సార్లు గెలిపించారని, సీఎం కేసీఆర్ తనకు కీలక మంత్రి పదవి అప్పగించారని ఎర్రబెల్లి తెలిపారు. పంచాయతీరాజ్ శాఖను సమర్థవంతంగా నిర్వహిస్తుండడంతో తెలంగాణకు దేశంలోనే ఏ రాష్ట్రానికి దక్కనన్ని అవార్డులు వచ్చాయన్నారు. మరోసారి ప్రజలు ఆశీర్వదిస్తే అర్హులందరికీ ఇండ్లు మంజూరు చేయిస్తానని వివరించారు. ప్రతి గ్రామంలో వంద మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానన్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా 5,500 డబుల్‌బెడ్ రూం ఇండ్లు నియోజకవర్గానికి మంజూరు చేయగా 90 శాతం పూర్తి చేశామన్నారు. వాగులపై రూ. 100 కోట్లతో చెక్‌డ్యాములు నిర్మించడంతో సాగునీటి సమస్య తీరిందన్నారు. రూ. 1000 కోట్లతో బీటీ, సీసీ రోడ్లు నిర్మించామన్నారు.

## ప్రజల ఆకాంక్ష మేరకు అభివృద్ధి పనులు..

పాలకుర్తి నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలకనుగుణంగా మ్యానిఫెస్టోను అమలు చేసేందుకు కార్యాచరణ చేపడుతున్నట్లు మంత్రి ఎర్రబెల్లి తెలిపారు. రైతులు పండించిన పంటలకు నష్టాన్ని కలిగిస్తున్న కోతుల సమస్యను నివారించేందుకు వాటిని అడవులకు తరలించే నిరంతర కార్యక్రమాన్ని తీసుకొచ్చామన్నారు. ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చి ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు ఇప్పించే కార్యక్రమం అమలు చేస్తాన్నారు. మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇప్పించి ఉచితంగా కుట్టుమిషన్లు అందించడంతోపాటు టెక్స్‌టైల్ పరిశ్రమల్లో ఈ సంవత్సరం ఏడు వేల మందికి ఉద్యోగాలు ఇప్పించామన్నారు. డ్రైవింగ్ లైసెన్స్‌లు లేని 20 వేల మందిని గుర్తించి వారికి ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇప్పించామని ఎర్రబెల్లి తెలిపారు.

## పాలకుర్తి కేంద్రంగా టూరిజం కారిడార్..

సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో పాలకుర్తి కేంద్రంగా రూ. 100 కోట్లు వెచ్చించి టూరిజం కారిడార్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి ఎర్రబెల్లి తెలిపారు. పాలకుర్తి శైవ క్షేత్రాన్ని సుందరంగా తీర్చి తొలికవి సోమనాథుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించామన్నారు. మహాభాగవతాన్ని రచించిన బమ్మెర పోతనామాత్యుడి స్వగ్రామం బొమ్మెరలో పోతన విగ్రహంతో పాటు బాసరకు ధీటుగా తీర్చిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు. రామాయణాన్ని రాసిన వాల్మీకి నడయాడిన వల్మిడి గుట్టపై భద్రాచలం, అయోధ్యకు దీటుగా నూతన రామాలయ నిర్మించినట్లు గుర్తు చేశారు.

## 10న మరోసారి నామినేషన్ దాఖలు చేస్తా..

ఈ నెల 10న మరోసారి నామినేషన్ దాఖలు చేస్తానని మంత్రి ఎర్రబెల్లి తెలిపారు. పార్టీ శ్రేణులతో కలిసి వేలాది మందితో ర్యాలీగా వెళ్లి నామినేషన్ వేస్తానని, దీనికి ముఖ్యఅతిథులుగా మంత్రులు హరీశ్‌రావు, సత్యవతిరాథోడ్, స్టేషన్‌ఘన్‌పూర్ అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, ఆరోగ్య శ్రీ ట్రస్టు చైర్మన్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎన్ సుధాకర్‌రావు హాజరవుతారని ఆయన వెల్లడించారు. ఈ నెల 14న తొర్రూరులో నిర్వహించే ఎన్నికల ప్రచార సభకు సీఎం కేసీఆర్ హాజరవుతారని తెలిపారు. ఆనంతరం దయన్న పాటల సీడీని ఆవిష్కరించారు. సమావేశంలో రాష్ట్ర నాయకుడు రామసహాయం కృష్ణకిషోర్‌రెడ్డి, జీసీసీ మాజీ చైర్మన్ ధరావత్ గాంధీనాయక్ పాల్గొన్నారు.

### యాదాద్రి, పాలకుర్తి క్షీరగిరి క్షేత్రంలో ఎర్రబెల్లి పూజలు

నామినేషన్ దాఖలుకు ముందు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పాలకుర్తిలోని సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో, హనుమాన్ ఆలయంలో, ఐనవోలు మల్లికార్జున స్వామి దేవాలయం, రామన్నగూడెం షిరిడీ సాయిబాబా ఆలయంలో పూజలు చేశారు. అనంతరం చర్చిలో, తొర్రూరులోని మసీదులో ప్రార్థనలు చేశారు.


తమ్మడపల్లి(జీ)లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరి

# ఆశీర్వదించండి.. సేవలందిస్తా

- అవినీతికి తావులేకుండా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా
- అబద్ధాల కాంగ్రెస్, బీజేపీకి ఓట్లతోనే బుద్ధి చెప్పాలి
- సీఎం కేసీఆర్ పాలనలోనే పండుగలా వ్యవసాయం
- కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరి

జఫర్‌గఢ్, నవంబర్ 6: ఈ ఎన్నికల్లో తనను నిండుమనసుతో ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపిస్తే ఐదేళ్లు ప్రజలకు సేవలందిస్తానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని ఒబులాపూర్, ముగ్ధుంతండా, తమ్మడపల్లి(జీ), తిమ్మాపూర్, హిమ్మత్‌నగర్, సూరారం, తీగారం గ్రామాల్లో సోమవారం నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమావేశాలకు ముఖ్య అతిథిగా కడియం శ్రీహరి హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు, ఆయా గ్రామాల ప్రజలు డప్పుచప్పుళ్లతో ఘన స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సమావేశాల్లో కడియం శ్రీహరి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ తనను స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇచ్చారని, ప్రజలు ఆశీర్వదిస్తే నిజాయితీగా, అవినీతికి తావులేకుండా ప్రజాసేవ చేస్తానన్నారు. 1994, 1999, 2008లో ఎమ్మెల్యేగా, మంత్రిగా సేవలందించానని తెలిపారు. 2014లో ఎంపీగా, అనంతరం డిప్యూటీ సీఎంగా బాధ్యతలు నిర్వహించి సీఎం కేసీఆర్ సారథ్యంలో సేవలందించానన్నారు. వ్యవసాయానికి 24 గంటలు ఉచిత విద్యుత్ అందిస్తున్నారని పేర్కొన్నారు.

## అర చేతిలో వైకుంఠం చూపుతున్న కాంగ్రెస్..

అర చేతిలో వైకుంఠం చూపుతూ అబద్ధాలతో మాయమాటలు చెబుతున్న కాంగ్రెస్ నేతలకు ఈ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని కడియం శ్రీహరి ప్రజలను కోరారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఓట్ల కోసం గ్రామాల్లోకి వచ్చినపుడు వారు పాలించే రాష్ట్రాల్లో అమలయ్యే సంక్షేమ పథకాలపై నిలదీయాలని సూచించారు. కాంగ్రెస్ పాలించే కర్ణాటక రాష్ట్రంలో అక్కడి డిప్యూటీ సీఎం డీకే శివ కుమార్ వ్యవసాయానికి 5 గంటల కరెంట్ ఇస్తున్నామని ప్రకటించి వారి అసమర్థ పాలనను నిరూపించుకున్నారని తెలిపారు. టీ-పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తెలంగాణలో వ్యవసాయానికి 24 గంటల కరెంట్ వద్దు.. మూడు గంటలు చాలని చెప్పిన మాటలను కడియం శ్రీహరి ప్రజలకు గుర్తు చేశారు. రైతులు సుభిక్షంగా ఉండాలంటే కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.

## కాంగ్రెస్, సీపీఐ నుంచి బీఆర్ఎస్‌లో చేరికలు..

మండలంలోని తమ్మడపల్లి(జీ)లో కాంగ్రెస్, సీపీఐ పార్టీలకు చెందిన నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. సర్పంచ్ అన్నెపు పద్మాఅశోక్ దంపతులు సొంత ఖర్చులతో కొనుగోలు చేసిన 200 గజాల స్థలాన్ని గౌడ కమ్యూనిటీ హాలుకు విరాళంగా అందించారు. కార్యక్రమాల్లో స్టేషన్ ఘన్‌పూర్ మార్కెట్ చైర్మన్ గుజ్జరి రాజు, పెద్దిరెడ్డి పాల్గొన్నారు.

# కాంగ్రెస్ గెలిస్తే మళ్లీ కష్టాలే..

- వారెంటీ లేని గ్యారెంటీలు మనకొద్దు
- పరకాలను అభివృద్ధి చేశా.. ఆశీర్వదించండి
- బీఆర్ఎస్ పార్టీతోనే సమగ్రాభివృద్ధి
- పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి
- సంగెం, గీసుగొండ మండలాల్లో ఎన్నికల ప్రచారం

గీసుగొండ/సంగెం, నవంబర్ 6 : కాంగ్రెస్ పార్టీ మాయమాటలకు మోసపోయి ఓటేస్తే ప్రజలకు మళ్లీ కష్టాలు మొదలవుతాయని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. గీసుగొండ మండలంలోని ఎలుకుర్తి, ఆరెపల్లి, అనంతారం, మచ్చాపురం గ్రామాలు, సంగెం మండలంలోని తిమ్మాపురం, గాంధీనగర్, కొత్తగూడెం గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బతుకమ్మలు, బోనాలతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. గ్రామాల్లో చల్లా ఇంటింటికీ తిరుగుతూ స్థానికులను అప్యాయంగా పలకరిస్తూ ఓటు అభ్యర్థించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ సాధ్యం కాని హామీలను ఇస్తు ప్రజలను మభ్యపెడుతున్నదన్నారు. ప్రజలు ఆలోచించాలని మోసపోతే గోసపడ్తామని కాంగ్రె స్ వస్తే కరెంటు, రైతుబంధు, రైతుబీమా బంద్ అవుతాయని అన్నారు. కాంగ్రెస్ 6 హామీలపై ఆ పార్టీ నాయకులకే నమ్మకం లేదని విమర్శించారు. కర్ణాటకలో ఇచ్చిన హామీలకే గతిలేదు.. ఇక్కడ ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. తొమ్మిదేళ్లలో తెలంగాణ రాష్ట్రంలో 60 ఏండ్ల అభివృద్ధి జరిగిందన్నారు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన విధంగా సౌభాగ్యలక్ష్మి పథకం ద్వారా ప్రతి మహిళలకు నెలకు రూ.3 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతి ఏడాది ఉద్యోగ క్యాలెండర్ విడుదల చేస్తామన్నారు. పరకాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని, ప్రజలు మళ్లీ ఆశీర్వదించి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటానని పేర్కొన్నారు. దుర్మార్గ కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. వ్యవసాయానికి 3గంటల కరెంటు చాలన్న కాంగ్రెస్ నాయకులను గ్రామాల్లోకి వస్తే నిలదీయాలన్నారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో స్థానికులకే ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పూండ్రు జైపాల్‌రెడ్డి, వాడికారి జ్యోతి, బోడకుంట్ల ప్రకాశ్, ఎంపీటీసీ రజిత, జడ్పీటీసీ పోలీసు ధర్మారావు, మండలాధ్యక్షుడు వీరగోని రాజ్‌కుమార్, కార్యదర్శి చల్లా వేణుగోపాల్‌రెడ్డి, ఎలుకుర్తి సొసైటీ చైర్మ న్ మోహన్‌రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు రాజేశ్వర్‌రావు, బాలరాజు, క మలాకర్, వెంకటేశ్వర్లు, రాజేందర్, రాజు, చిన్న, ప్రమోద్, లెనిన్, రాజ్‌కుమార్, రాజు, రవీందర్, ముంత రాజయ్య, చంద్రమౌళి, గడ్డమీది కుమారస్వామి, ఆర్‌బీఎస్ మండల కో ఆర్డినేటర్ లింగారెడ్డి, మల్లారెడ్డి, నాగేశ్వర్‌రావు, బాబు, నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, ఎంపీపీ కందకట్ల కళావతి, జడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ బుక్క మల్లయ్య, కందకట్ల నరహరి, మండలాధ్యక్షుడు పసునూరి సారంగపాణి, సర్పంచ్‌లు గన్ను శారదాసంపత్, వాసం రజితాసాంబయ్య, ఏకాంబ్రం వెంకటేశ్వర్‌రావు, సొసైటీ చైర్మన్ వేల్పుల కుమారస్వామియాదవ్, సాగర్‌రెడ్డి పాల్గొన్నారు.


గీసుగొండ : ఎలుకుర్తి గ్రామంలో ఎన్నికల ప్రచారానికి తరలివచ్చిన వేలాది మంది ప్రజలు
ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి